క్లుప్తంగా

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న సాయిబాబా

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీ వద్ద గల మహత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో గల సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం 6 గంటలకు బాబాకు హారతి, మేలుకొలుపు పూజలను ఆలయ అర్చకులు చంద్రశేఖర్‌శర్మ నిర్వహించారు. అనంతరం బాబాకు పంచామృతాలు, విభూతితో అభిషేకించారు. అభిషేకాల అనంతరం బాబాకు పట్టు వస్త్రాలు, వెండి ఆభరణాలు, సుగంధ మాలలను అలంకరించారు. ఉదయం 8 గంటలకు స్థానిక భక్తులు బాబా కీర్తనలను ఆలపించారు. మధ్యాహ్నం పలువురు భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం హారతి పూజలు, పల్లకీ సేవ చేపట్టారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్‌పై మృతదేహం

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ సమీపంలోని పాతగోపాలపట్నం వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో రైల్వే అధికారులు గుర్తించి, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 40 -45 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని రైలు ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై జీఆర్‌పీ ఎస్‌ఐ రామారావు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

రేపటి నుంచి శ్రీవారి లడ్డూ విక్రయాలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి లడ్డూ విక్రయాలు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఇటీవల ఒంటిమిట్టలో జరిగిన సీతారాముల కల్యాణం నేపథ్యంలో శ్రీవారి లడ్డూలు అక్కడకు తరలించడంతో ఇక్కడ విక్రయాలు నిలిపివేశామని.. శనివారం నుంచి యథావిధిగా విక్రయాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఒలింపియాడ్‌లో అరబిందో విద్యార్థులకు పతకాలు

ఉక్కునగరం: స్థానిక అరబిందో ఐడియల్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఒలింపియాడ్ పోటీల్లో పలు పతకాలు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో గత నవంబర్, డిసెంబర్ నెలల్లో లెవెల్-1 పరీక్షలు జరిగాయి. గణితం, సైన్స్, కంప్యూటర్స్, జనరల్ నాలెడ్జ్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్ తదితర విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో పాఠశాల నుండి 69 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 32 మంది విద్యార్థులు స్వర్ణ పతకాలు, 15 మంది రజత పతకాలు, 8 మంది కాంస్య పతకాలు సాధించారు. ఈ విద్యార్థులందరూ లెవెల్-2 పోటీలకు కూడా ఎంపికయ్యారు. ప్రత్యేకంగా సోషల్ స్టడీస్ విభాగంలో పాల్గొన్న కె. యశస్వి కృష్ణ స్వర్ణ పతకంతో పాటు నగదు బహుమతిని గెలుచుకుంది.

ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు



ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయిస్తున్న నాయకులు

గాజువాక : ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం స్థానిక బీజేపీ నాయకులు పలువురు అభ్యర్థులతో దరఖాస్తు చేయించారు. పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో అభ్యర్థులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులకు రూ.10 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. 60 శాతం వరకు సబ్సిడీ లభిస్తుందని, ఈ అవకాశాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ములకలపల్లి ప్రకాష్, శ్రీనివాసరావు, ప్రసన్న కుమారి, లక్ష్మి, శంకరమ్మ, మధు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లోపమే శాపమై..

- కల్వర్టు నిర్మించినా ప్రయోజనం శూన్యం
- చిన్నపాటి వర్షానికే మురుగు రోడ్లపైకి..
- ఆ బురదలోనే స్థానికుల రాకపోకలు
- శానిటరీ సిబ్బందికి తప్పని అవస్థలు
- లక్షల రూపాయల నిధులు వృథా



మురుగు దారిలోనే నడుస్తున్న పాదచారులు

కంచరపాలెం: అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఆ ప్రాంత ప్రజలకు, పారిశుధ్య కార్మికులకు శాపంగా మారింది. లక్షల నిధులు వెచ్చించినా లక్ష్యం నెరవేరకుండానే పోయింది. కల్వర్టు నిర్మించినా మురుగు సమస్య పరిష్కారం కాకపోవడంతో చిన్న వానకే రోడ్లంతా వ్యర్థాలతో, బురదతో నిండిపోతోంది.

జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దుర్గానగర్, తోటవీధి రైల్వేట్రాక్ రహదారిలో కల్వర్టు సమస్య స్థానికులను ఏళ్ల తరబడి వేధిస్తోంది. చిన్న వర్షం కురిసినా, కల్వర్టు పొంగి, రోడ్లు మురుగుతో నిండిపోయేవి. దీంతో ఆ తర్వాత నాలుగైదు రోజులు ఆ మురుగు రోడ్లలోనే పాదచారులు, ద్విచక్రవాహనదారులు ప్రయాణించాల్సి వచ్చేది. సమస్య పరిష్కారం కోసం స్థానికులు జీవీఎంసీ జోన్-4 కార్యాలయం చుట్టూ.. వార్డు కార్పొరేటర్ రాజశేఖర్ చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగితే, కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. గత ఫిబ్రవరి నెలలో సుమారు రూ.9.80లక్షల జీవీఎంసీ నిధులతో ఇంజినీరింగ్ విభాగ అధికారుల పర్యవేక్షణలో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఎన్నో ఏళ్ల సమస్య పరిష్కారం కానుందని స్థానికులు ఎంతో సంతోషించారు. అయితే, ఆ ఆనందం ఎన్నాళ్లో నిలవలేదు. కల్వర్టును సక్రమంగా నిర్మించక పోవడంతో పారిశుధ్య సమస్య మళ్లీ మొదటికే వచ్చింది. నిర్మాణం పూర్తయి ముచ్చటగా మూడు నెలలైనా గడవక ముందే ఇటీవల కురిసిన చిన్న వర్షానికే రోడ్లు, చిన్న కాలువలు, ప్రధాన రహదారి, వీధులు మురుగునీట మునిగాయి.

అడుగుభాగంలో అసంపూర్తి పనులు..

ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం తమ పాలిట శాపంగా మారిందని పలువురు పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సక్రమంగా మురుగు ప్రవాహానికి కల్వర్టు అడుగు భాగాన అసంపూర్తి పనులు చేసి వదిలేయడంతో సమస్య ఇలా పునరావృతం అవుతోందని చెబుతున్నారు. దీంతో కల్వర్టు నిర్మించినా, మళ్లీ వ్యర్థాల తొలగింపు పని కార్మికుల పైనే పడుతోంది. చిన్న వర్షానికే రోడ్లు, వీధులు మురుగుమయం కావడంతో స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



కొత్త వంతెన నిర్మించినా వెళ్లని వ్యర్థాలు.. ప్రవహించని మురుగు

మళ్లీ సమస్య మొదటికే వచ్చింది

సమస్య మళ్లీ మొదటికే వచ్చింది. మురుగు రహదారులపై ప్రవహిస్తోంది. పారిశుధ్య కార్మికులకు, పాదచారులు, వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. కల్వర్టు నిర్మించి ఏం ప్రయోజనం అన్నట్టుగా మారింది. సంబంధిత ఉన్నతాధికారులు పర్యవేక్షించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– ఎం.రాజ్యలక్ష్మి, స్థానికురాలు, దుర్గానగర్, కంచరపాలెం

చిన్న వానకే రోడ్డుపైకి మురుగు

మురుగు సమస్య పరిష్కరించాలని అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి నిధులు మంజూరు చేయించుకున్నాం. కాంట్రాక్టర్ కక్కుర్తి పడ్డాడో అధికారుల పర్యవేక్షణ లోపమో తెలియదు గానీ, సమస్య మునుపటిలానే మారింది. కల్వర్టు నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో మురుగు, చెత్తాచెదారాలు సక్రమంగా ప్రవహించడం లేదు. గత వారంలో కురిసిన వర్షానికి మళ్లీ రహదారి మురుగు మయంగా మారింది.

– ఎస్. పరదేశినాయుడు, స్థానికుడు, తోటవీధి, కంచరపాలెం



తోటవీధి నుంచి దుర్గానగర్‌కు వెళ్లే రైల్వేట్రాక్ రహదారి మురుగునీటితో అస్తవ్యస్తంగా ఇలా..



కల్వర్టు నిర్మించినా పారిశుధ్య కార్మికులకు తప్పని అవస్థలు

ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

సింధియా: మానవ వనరుల శిక్షణ, సాంకేతిక అభివృద్ధి, విద్యా సేవలకు అంకితమైన భారత ప్రభుత్వ సంస్థ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ (సెమ్స్), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)తో కలిసి దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన (డీడీయు-జికెవై) పథకం కింద ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ అందివ్వనున్నారు. ఈ శిక్షణ కోసం 18 నుంచి 27 ఏళ్లు కలిగిన, బీ.ఈ, బీ.టెక్ (ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్), ఐ.టి.ఐ (వెల్డర్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్ ట్రేడ్‌లు), డిప్లొమా ఇన్ మెకానికల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులు. వీరికి ఇండస్ట్రియల్ ఆటోమేషన్ స్పెషలిస్ట్, ఆటోమోటివ్ వెల్డింగ్ మెషిన్ టెక్నీషియన్, సీఎన్‌సీ టర్నింగ్ కోర్సుల్లో వసతితో సహా ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సింధియా జంక్షన్ సమీపంలో గల సెమ్స్ కేంద్రంలో గానీ, 8688411100, 8331901237, 0891-2704010 ఫోన్ నెంబర్లలో గానీ ఏప్రిల్ 21వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

20న మెగా ఆస్ట్రాలజీ సదస్సు

డాబాగార్డెన్స్: హైదరాబాద్‌కు చెందిన ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న సింహాచలంలో మెగా ఆస్ట్రాలజీ సదస్సు నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నరసింహస్వామి, ఏరియా కో ఆర్డినేటర్ డాక్టర్ అరుణ్ మహేష్, కామేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం కానుందని, మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. మ్యారేజ్ క్యాపబిలిటీ, జ్యోతిష్య శాస్త్రంలోని యోగాలు, దోషాలు, వాటి పరిహారాలపై ప్రముఖ జ్యోతిష్య పండితులు డాక్టర్ పి. అరుణ్ మహేష్, డాక్టర్ కృష్ణమూర్తి, ఎం. శేషారావు, వి. రమణారావు ప్రసంగించనున్నారని తెలిపారు. సదస్సులో పాల్గొనదలిచే వారు 7281913456 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, యూటీఎఫ్ ప్రతినిధులు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యూటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగేలా యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను గురువారం తన చాంబర్‌లో యూటీఎఫ్ నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, వారి బంగారు భవితకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్కూళ్లు బలోపేతమైతేనే అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ప్రధానమైనదన్నారు. 2025-26 విద్యా సంవత్సంలో అడ్మిషన్లు పెరిగేలా ప్రతీ ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్, కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

మేహాద్రి గెడ్డ గురుకుల పాఠశాలలో సౌకర్యాలపై ఆరా



మేహాద్రి గెడ్డ గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న మంత్రి వీరాంజనేయస్వామి

గోపాలపట్నం: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోల వీరాంజనేయ స్వామి గురువారం సాయంత్రం జీవీఎంసీ 92వ వార్డు పరిధిలోని మేహాద్రి గెడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పాఠశాలలోని సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు వంటి వాటిని స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి పాఠశాల పరిస్థితులు, వారి విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకున్నారు.


అనంతరం మంత్రి కళాశాల ఉపాధ్యాయులు, అధ్యక్షులు, ప్రిన్సిపాల్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ గణబాబు పాఠశాలలోని పరిస్థితులను మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవరావు, గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఏసుక్రీస్తు జీవిత ఘట్టాల చిత్రాలు



చిరుధాన్యాలతో రూపొందించిన చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

విశాఖ విద్య: గుడ్ ఫ్రైడే సందర్భంగా ఏసుక్రీస్తు జీవితంలోని 14 ముఖ్యమైన సంఘటనలను ప్రతిబింబిస్తూ నగరానికి చెందిన చిరుధాన్యాల చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ అద్భుతమైన మిల్లెట్ ఆర్ట్ చిత్రాలను రూపొందించారు. ఈ ప్రత్యేక చిత్ర ప్రదర్శన గురువారం నుంచి ఎన్ఏడీ జంక్షన్ వద్ద ఉన్న సెయింట్ థామస్ చర్చిలో (పునీత తోమాసు వారి ఆలయంలో) ప్రదర్శనకు ఉంచారు. ఏసుక్రీస్తును సిలువ వేసే సమయంలో జరిగిన 14 ప్రధాన ఘట్టాలను అత్యంత సహజంగా ఈ చిత్రాలలో విజయ్ కుమార్ ఆవిష్కరించారు. దాదాపు నెల రోజుల పాటు శ్రమించి ఆయన ఈ కళాఖండాలను తీర్చిదిద్దారు. ఈ చిత్రాలను దేశవ్యాప్తంగా వివిధ ప్రముఖ ప్రాంతాలలో ప్రదర్శించిన అనంతరం, వాటిని వాటికన్ సిటీ పోప్‌కు భారతదేశం తరఫున బహుమతిగా అందించాలని తన ఆకాంక్షను విజయ్ కుమార్ వ్యక్తం చేశారు. ఈ మిల్లెట్ ఆర్ట్ చిత్ర ప్రదర్శనను చర్చి ఫాదర్ ఇలియాస్, సెయింట్ ఆంథోనీ స్కూల్ డైరెక్టర్ కుమార్ తదితరులు సందర్శించి విజయ్‌కుమార్ అద్భుతమైన ప్రతిభను ప్రశంసించారు.



చిరుధాన్యాలతో రూపొందించిన ఏసుక్రీస్తు జీవితంలోని ఓ ఘట్టం

పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి

మల్కాపురం: 59వ వార్డులోని హిమచల్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ వరలక్ష్మి గర్భిణులు, బాలింతలకు తీసుకోవాల్సిన పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. సూపర్‌వైజర్ వరలక్ష్మి మాట్లాడుతూ వేసవిలో గర్భిణులు తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తలు , సూచనలు చేశారు. 15 రోజుల పాటు ఈ పక్షోత్సవాలు కొనసాగుతాయని, ప్రతి రోజూ ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.45 లక్షలు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 21 రోజులకు గాను రూ.16.45 లక్షలు నగదు, బంగారం 2.977 మిల్లీ గ్రాములు, వెండి 0.098 మిల్లీ గ్రాములు పలు దేశాలకు చెందిన డాలర్స్ ఒమన్ రియల్ 40, మలేసియా రింగ్గిట్ 1, కతర్ రియల్ 1, ఒక చెక్కు లభించాయని ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.శిరీష తెలిపారు.

మద్యం సీసాలతో పట్టుబడిన కారు వేలం

అక్కిరెడ్డిపాలెం: మద్యం సీసాలు విక్రయిస్తూ, నిల్వ ఉంచుకుని రవాణా చేస్తున్నందుకు సీజ్ చేసిన కారును వేలం వేయనున్నట్టు గాజువాక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గత ఏడాది నవంబర్ 4న గాజువాక పరిధిలో ఏపీ 31 బీఎస్ 3266 నంబరు గల మారుతీ 800 బీఎస్ 3 కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కారును శుక్రవారం గాజువాక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద వేలం వేయనున్నారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు నేరుగా స్టేషన్‌కు రావాలని కోరారు.

పేద విద్యార్థుల ప్రోత్సాహమే లక్ష్యం



మినీ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డబ్ల్యూఎస్ఎస్ కేర్స్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు నారాయణ

కంచరపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బలహీన వర్గాల విద్యార్థులను ప్రోత్సహించడమే డబ్ల్యూఎస్ఎస్ కేర్స్ ఫౌండేషన్ లక్ష్యమని సంస్థ విశాఖ, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యక్షుడు ఆర్ఎల్ నారాయణ తెలిపారు. గురువారం కంచరపాలెం పరిధిలోని జీవీఎంసీ రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం మినీ సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన పరికరాలను ఫౌండేషన్ అందజేసింది. ఈ సందర్భంగా ఆర్ఎల్ నారాయణ మాట్లాడుతూ, తమ సంస్థ దేశవ్యాప్తంగా చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించిందని వెల్లడించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ఉన్నత విద్యను అభ్యసించాలని, అందుకు అవసరమైన ప్రాథమిక విద్యను అందించడమే తమ సంస్థ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. దీనిలో భాగంగానే అవసరమైన మౌలిక వసతులను అందిస్తున్నామని తెలిపారు. కంప్యూటర్ టీచర్లు, లైబ్రరీ పుస్తకాలు, మినీ సైన్స్ ల్యాబ్‌లు, టీచింగ్ సిబ్బందిని కూడా తమ సంస్థ ద్వారా అందించే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ శ్రీనివాసరావు, పాఠశాల కంప్యూటర్ టీచర్ మరియు కో-ఆర్డినేటర్ సిహెచ్ పల్లవి, సంస్థ ప్రతినిధులు తిరుమలేష్, కులకర్ణి, సిహెచ్ నీలిమ, నాగరాజు నారాయణస్వామి, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన శ్మశానవాటిక పనులు



శ్మశాన వాటికలో ప్రారంభం కాని పనులు

మల్కాపురం: మల్కాపురం పారిశ్రామిక ప్రాంతంలోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండటంతో మృతదేహాలను తీసుకువచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దాదాపు వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ హిందూ శ్మశానవాటిక పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీని కారణంగా అంత్యక్రియల కోసం వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. ఈ పరిస్థితిని గమనించిన అధికారులు సుమారు రూ.1.80 కోట్ల వ్యయంతో శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మూడు వారాల క్రితం భూమి పూజ నిర్వహించారు. నాటి నుంచి పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. శ్మశానవాటికలో ఒక భాగంలో ఇప్పటికీ పునాదులు తీయలేదు. మరో భాగంలో పిల్లర్ల కోసం తీసిన గుంతల్లో సిమెంట్ పనులు ప్రారంభం కాలేదు. ఈ కారణంగా మృతదేహాలను దహనం చేయడానికి వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజల ఇబ్బందులను తొలగించాలని పలువురు అధికారులను కోరుతున్నారు.



శ్మశానవాటికలో ఇంకా పునాదులకు నోచుకోని దృశ్యం

మే నాటికి ఆర్‌వోబీ పనులు పూర్తి చేయాలి



ఆర్‌వోబీ పనులు పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ విద్య: రైల్ ఓవర్ బ్రిడ్జ్(ఆర్‌వోబీ) పనులు ఎట్టి పరిస్థితుల్లోను మే నెలాఖరు నాటికి పూర్తి చేసి బ్రిడ్జ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆయన గురువారం పలు ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా సెంట్రల్ నర్సరీలో సుమారు రూ.93 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను ఇంజనీర్లు, గుత్తేదారు ప్రతినిధిని అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ మధుసూదనరావు, డీఎఫ్‌వో సుజాతా శివానీ, సహాయక ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.